# చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలి



చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్, ఎస్పీ అపూర్వరావు

● కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్, ఎస్పీ అపూర్వరావు

మునుగోడు, అక్టోబర్ 25 : ఎన్నికల నిర్వహణలో భాగంగా చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ. కర్ణన్, ఎస్పీ కె.అపూర్వరావు ఆదేశించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును బుధవారం వారు సందర్శించి వాహనాల తనిఖీని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున విధులు కేటాయించబడిన అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు నిర్వహించే సమయంలో వీడియో సర్వేలెన్స్ టీం అధికారులు తనిఖీలను వీడియో రికార్డింగ్ చేయాలని, నగదు, మద్యం తదితర ఓటర్లను ప్రలోభ పెట్టే అంశాలు తరలింపు జరగకుండా ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, చెక్ పోస్టు అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**ఎన్నికల నిర్వహణకు పటిష్ట భద్రతా చర్యలు : ఏసీపీ**

చౌటుప్పల రూరల్ : ఎన్నికల నిర్వహణకు పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నట్లు చౌటుప్పల్ ఏసీపీ వై.మొగులయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే సమస్యాత్మక పోలింగ్ బూతులు చౌటుప్పల మండలంలో 21, నారాయణపురం మండలంలో 13 బూతులను గుర్తించినట్లు తెలిపారు. చౌటుప్పల్ డివిజన్ పరిధిలో ఎన్నికల నిర్వహణకు ఆటంకాలు కలిగించే క్రిమినల్ వ్యక్తులను బైండోవర్ చేస్తున్నట్లు తెలిపారు. చౌటుప్పల్ డివిజన్ ప్రధాన జాతీయ రహదారిపై పంతంగి టోల్ గేట్ వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేశామని, మరొకటి తూఫ్రాన్‌పేట వద్ద త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు.



సంస్థాన్‌నారాయణపురం : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్

# కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా సహకార శాఖాధికారి శ్రీనివాస్**

సంస్థాన్ నారాయణపురం, అక్టోబర్ 26 : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార శాఖాధికారి శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వరి ధాన్యం ఏ గ్రేడ్ రకానికి రూ.2,203, సాధారణ రేటు రూ.2,183 ధరను ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ నాగరాజు, ఏఈఓ శశిబిందు, మానిటరింగ్ అధికారి జమీల్ అహ్మద్, సీఈఓ శేఖర్, రవి, యాదయ్య పాల్గొన్నారు.

చండూరు : రైతు సేవా సహకార సంఘం చండూరు ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని అంగడిపేటలో నిర్వహించనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సంఘం చైర్మన్ కోడి సుష్మ రైతులను కోరారు. అదేవిధంగా కస్తాల, తేరట్‌పల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరలో ప్రారంభించేందుకు నిర్ణయించామని తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర పొందాలని సూచించారు.

## ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి

నేరేడుచర్ల, అక్టోబర్ 25 : అసెంబ్లీ ఎన్నిక ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకొనేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని ఎస్ఐ పరమేశ్ కోరారు. సమస్యాత్మక గ్రామంగా గుర్తించిన మండలంలోని మేడారంలో బుధవారం ఆయన రాజకీయ పార్టీలు, ప్రజలతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొడవలకు పోకుండా అందరూ ప్రశాంత వాతావరణంలో ప్రచారాలు నిర్వహించాలని సూచించారు. చట్టం ముందు అందరూ సమానమేనని, చట్టాన్ని అతిక్రమిస్తే ఎంత పెద్దవారైన చర్యలు తప్పవన్నారు. ఏదైనా గొడవలు జరిగే అవకాశం ఉంటే ఒంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ స్వాతీమధు, వివిధ పార్టీల నాయకులు అరిబండి సురేశ్ బాబు, అరిబండి సీతారామయ్య, కట్టా మధు, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, కృష్ణయ్య పాల్గొన్నారు.

## 'కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారాలు మానుకోవాలి'

చింతలపాలెం, అక్టోబర్ 25 : కాంగ్రెస్ పార్టీ నాయకులు తప్పుడు ప్రచారాలు మానుకోవాలని బీఆర్ఎస్ మండల నాయకుడు మోర్తాల వెంకట్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని వెల్లటూరు శివగంగ లిఫ్టు పైపుల మరమ్మతులు పూర్తవడంతో రైతులు చాలా ఆనందంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి రైతుల సంక్షేమాన్ని ఆలోచించి, లిఫ్టు మరమ్మతులకు రూ. 1.12కోట్లు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించి మరమ్మతులు చేయించారన్నారు. ఎమ్మెల్యే సైదిరెడ్డి, బీఆర్ఎస్ ప్రభుత్వానికి రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనం అన్నారు. కాంగ్రెస్ హయాంలో కాంట్రాక్టర్ల స్వార్థం, నిర్లక్ష్యం వల్ల పైపులైన్లు మరమ్మతులకు గురవుతున్నాయన్నారు. ఇదే అదునుగా కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. దుష్ప్రచారాలు మానుకోవాలని హెచ్చరించారు.

# హైవేపై డీసీఎం సడన్ బ్రేక్

● వరుసగా ఢీకొన్న వాహనాలు

చౌటుప్పల్ రూరల్, అక్టోబర్ 25 : 65వ నంబర్ జాతీయ రహదారిపై వరుసగా వాహనాలు ఢీకొన్నాయి. చౌటుప్పల్ మండలంలోని దండు మల్కాపురం వద్ద ఈ సంఘటన బుధవారం జరిగింది. డీసీఎం సడెన్ బ్రేక్ వేయడంతో వరుసగా నాలుగు కార్లు, బస్సులు ఢీకొన్నాయి. ప్రమాదంలో వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు పేర్కొన్నారు.



ప్రమాదానికి గురైన వాహనాలు

# గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

చౌటుప్పల్, అక్టోబర్ 25 : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందారు. ఈ సంఘటన చౌటుప్పల్ పట్టణ పరిధిలోని మల్లికార్జున వే బ్రిడ్జి ఎదురుగా 65వ జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన దొడ్డ ఉషయ్య గౌడ్(55) దివిస్ పరిశ్రమలో దినసరి కూలీగా పనిచేస్తూ.. చౌటుప్పల్ పట్టణకేంద్రంలోని పద్మశాలికాలనీలో నివాసముంటున్నాడు. ఈ క్రమంలో తెల్లవారుజామున రోజుమాదిరిగా సైకిల్‌పై పరిశ్రమలో విధులకు వెళ్తుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీకొంది. ప్రమాదంలో అతడి తల, కాళ్లు, చేతులకు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.దేవేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఉషయ్యగౌడ్(ఫైల్)

# ప్రజా ఆశీర్వాద సభను జయప్రదం చేయాలి

● జడ్పీటీసీ వెంకటేశం, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కైలాసం

గట్టుప్పల్, అక్టోబర్ 25 : మునుగోడులో గురువారం నిర్వహించే బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభను జయప్రదం చేయాలని జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఇడం కైలాసం ఒక ప్రకటనలో ప్రజలను కోరారు. బహిరంగ సభకు సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నందున బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

**చౌటుప్పల్‌లో..**

చౌటుప్పల్ : మునుగోడులో ఈ నెల 26న నిర్వహిస్తున్న ప్రజా ఆశీర్వాద సభకు మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలి వచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల, మున్సిపాలిటీ అధ్యక్షులు గిర్కటి నిరంజన్‌గౌడ్, ముత్యాల ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సభకు సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా వస్తున్నందున పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.

## అన్నదాన సత్రానికి భూమిపూజ

మఠంపల్లి, అక్టోబర్ 25 : మండలంలోని మట్టపల్లి పుణ్యక్షేత్రంలో గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ అన్నదాన సత్ర నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ జగన్‌నాయక్ మా ట్లాడుతూ గిరిజనులందరూ ఐక్యంగా ఉండి సమాజంలో ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగాలని సూచించారు. సత్రం నిర్మాణానికి గిరిజన కులస్తులందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సత్రం కమిటీ చైర్మన్, ప్రధాన కార్యదర్శి, వైస్ ప్రెసిడెంట్ బాణోతు జగన్, నగేశ్‌రాథోడ్, బాణావత్ వెంకటేశ్వర్లు, పాలకవీడు ఎంపీపీ భూక్య గోపాల్, మేళ్లచెరువు మాజీ ఎంపీపీ భూక్య జామాచోక్లానాయక్ పాల్గొన్నారు.



అన్నదాన సత్రం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న గిరిజనులు

## కేసీ గుప్తా ఫ్లెక్సీకి నివాళి

నేరేడుచర్ల, అక్టోబర్ 25 : వాసవీ క్లబ్ వ్యవస్థాపకుడు కల్వకుంట్ల చంద్రసేన గుప్త వర్ధంతిని పురస్కరించుకుని నేరేడుచర్ల వాసవీ, వనితా క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్ బిల్డింగ్‌లో బుధవారం ఆయన ఫ్లెక్సీకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసవీ, వనితా క్లబ్ అధ్యక్షులు కొత్తా లక్ష్మణ్, వీరవల్లి శ్రీలతాకోటేశ్వర్‌రావు మాట్లాడుతూ సేవే పరమావధిగా వాసవీ క్లబ్ స్థాపించారన్నారు. ఒక్కడితో ప్రారంభమైన వాసవీ క్లబ్ నేడు దేశ విదేశాల్లో ప్రతి ఏడాది వేలాది కోట్ల రూపాయల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో వాసవీ, వనితా క్లబ్ సభ్యులు గజ్జల కోటేశ్వర్‌రావు, ఈగ భాగ్యలక్ష్మి, పోలిశెట్టి అశోక్, కందిబండ శ్రీనివాస్‌రావు, మురారిశెట్టి రమేశ్, జూలరు అశోక్, నటరాజ్, గోపాలకృష్ణ, రవీందర్ పరమేశం పాల్గొన్నారు.



చౌటుప్పల్ పట్టణంలో బారులుతీరిన వాహనాలు

## తిరుగు ప్రయాణం

చౌటుప్పల్, అక్టోబర్ 25 : పట్టణ కేంద్రంలోని 65వ జాతీయ రహదారిపై బుధవారం వాహనాలు బారులు తీరాయి. దసరా పండుగకు సొంతూర్లకు వెళ్లిన వారు సెలవులు పూర్తవడంతో తిరుగు ప్రయాణం కావడంతో ట్రాఫిక్ ఏర్పడింది. బారలుతీరిన వాహనాల్లో కార్లే అధిక సంఖ్యలో ఉన్నాయి. ట్రాఫిక్ పోలీసులు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తున్నారు. ట్రాఫిక్ రద్దీతో స్థానిక బస్టాండ్, తంగడపల్లి, వలిగొండ క్రాస్ రోడ్ల వద్ద రోడ్డు దాటలంటే వాహనాదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.